




గ్రామానికి చెందిన వికలాంగురాలు బోయభాగ్యమ్మకు పింఛను అందజేస్తున్న ముఖ్యమంత్రి

ఇండస్ట్రియల్ హబ్‌గా 'అనంత'





సభకు హాజరైన జనం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- నేమకల్లులో 'పేదల సేవ'లో పాల్గొన్న సిఎం
- రాయదుర్గం నియోజకవర్గానికి వరాల జల్లు

ప్రజాశక్తి - అనంతపురం, బొమ్మనహాల్, రాయదుర్గం

అనంతపురం జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లులో శనివారం ఏర్పాటు చేసిన పేదల సేవలో కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి లబ్ధిదారులకు సామాజిక పింఛనును అందజేశారు. శనివారం ఉదయం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో జింథాల్ విజయనగర ఎయిర్‌పోర్టుకు వచ్చిన చంద్రబాబు నాయుడు అక్కడిన ఉంచి హెలికాప్టర్‌లో నేమకల్లుకు వచ్చారు. ఈసందర్భంగా సిఎంకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మొదట గ్రామంలోని రెండు నిరుపేద కుటుంబాలకు పింఛను అందజేశారు. గ్రామానికి చెందిన గురువు భాగ్యమ్మకు అంగవైకల్యం పింఛను 6వేల రూపాయలు అందజేశారు. అనంతరం గ్రామంలో పురాతన దేవాలయం అయిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పేదల సేవలో ప్రజావేదికలో చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత ఉపాధి కోసం ఎక్కడో దూరప్రాంతాలకు వెళ్లకుండా వారి నియోజకవర్గ పరిధిలోనే ఉపాధి కల్పించేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్నామన్నారు. లబ్ధిదారులు 1, 2 నెల పింఛను తీసుకోకపోయినా మూడు నెలలు మొత్తం కలిపి ఒకేసారి చెల్లిస్తామన్నారు. పింఛన్ దారు ఎవరైనా చనిపోతే వారి భార్యకు కూడా వెంటనే పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెవిన్యూలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా కేవలం ఒక మెసేజ్ పెడితే మీకు పంపించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దాదాపు 150 పౌరసేవల్ని ఆన్‌లైన్‌లో పెట్టి టెక్నాలజీ ద్వారా సేవలు అందజేసే ఏర్పాటు కల్పిస్తున్నామన్నారు.

వరాలజల్లు

రాయదుర్గం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరాలజల్లు కురిపించారు. రాయదుర్గ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ పరిధిలోని బైరవానితిప్ప ప్రాజెక్టును హంద్రీనీవా నీటితో నింపుతామన్నారు. ఆనీటితో ఇంటింటికి కొళాయి పథకాన్ని పూర్తి చేస్తామన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. నేమకల్లు, ఉంతకల్లు మధ్యలో 5 టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఐరన్ ఎక్కువగా లభ్యమవుతున్న నేపథ్యంలో మరిన్ని పరిశ్రమలు వచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బొమ్మనహాల్ లో 25,000 ఎకరాల్లో ఇసుక మేటలు, దిబ్బలు ఉన్నాయని, ప్రతి సంవత్సరం అర కిలోమీటర్ పెరుగుతోందని, ఇసుక మేటలు, దిబ్బలు పెరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతాన్ని ఎడారిగా మారకుండా పూర్తిగా నియంత్రణ చేసే చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నామన్నారు.

ఆదర్శ పంచాయతీగా నేమకల్లు

నేమకల్లు పంచాయతీని ఆదర్శపంచాయతీగా తీర్చిదిద్దటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న పురాతన దేవాలయం నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ గోపురాల అభివృద్ధికి రూ. 3కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నేమకల్లు గ్రామాన్ని పరిశుభ్రంగా గ్రామంగా తీర్చిదిద్దడానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. సీసీ రోడ్లు, డ్రయినేజీల ఏర్పాటుకు రూ. 5కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామానికి బిసి రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామంలోని అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో 759 కుటుంబాలకు సోలార్ ప్యానల్స్ పెట్టుకునే అవకాశం ఉందని, మీకందరికీ ఉచితంగా సోలార్ గ్రిడ్ పెట్టించే కార్యక్రమం చేస్తామన్నారు. ఈ గ్రామంలో 1,49,720 చదరపు అడుగుల మేర ఇళ్లపై స్థలం ఉందని, 1,379 కిలోవాట్స్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని, ఇక్కడి ప్రభుత్వ భవనాలపై మరొక 32 కిలోవాట్స్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందన్నారు. రెస్కో కింద సంస్థను ఏర్పాటు చేసి రుణాలు అందిస్తామన్నారు. శ్రీధర్‌గట్ట నీటి ట్యాంకుకు హెచ్.ఎల్.సి మీరు అందించేలా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతపురం జిల్లాలో 10 ఎకరాలు మెట్ట పొలం ఉన్న రైతులకు కడుపు నిండడం లేదని అలాంటి వారందరికీ పింఛన్లు ఇవ్వడానికి, రేషన్ కార్డులు మంజూరు చేయడానికి అన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు.

రాయదుర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

జిల్లాలో అత్యంత వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గం అభివద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని రాయదుర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం నేమకల్లు గ్రామంలో పర్యటించిన సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించారు. 2014-19 కాలంలో చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి శ్రీకారం చుట్టినప్పటికీ అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిఇప ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేదన్నారు. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయినందున అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయడంతో పాటు కొత్తగా మరికొన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. 19 డిమాండ్లను తన వినతిపత్రంలో పేర్కొన్నారు. బిటిపి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడంతో పాటు ఉంతకల్లు వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని, తుంగభద్ర ఎగువ కాలువ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. హంద్రీనీవా పథకం 36 ఏ క్రింద మాల్యం, ఆవులదట్ల బ్రాంచ్ కెనాల్ ఏర్పాటు చేయాలన్నారు. డి. హీరేహాళ్, బొమ్మనహాల్ మండలాలలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి మధ్యతరహా ఉక్కు పరిశ్రమను స్థాపించాలని కోరారు. రాయదుర్గం పురపాలక సంఘం అభివృద్ధికి 50 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలన్నారు. వేదవతి నదిలో సబ్ సర్ఫేస్ డ్యాం నిర్మాణానికి, ఎడారీకరణ నివారణకు నిధులు మంజూరు చేయాలన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి, మండల కేంద్రాలు డి హీరేహాళ్, బొమ్మనహాల్ గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. కణేకల్‌లో డిగ్రీ కళాశాల, బొమ్మనహాల్‌లో బాలుర ఆశ్రమ పాఠశాల. డి. హిరేహాళ్ వద్ద ఊటచెరువు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలన్నారు.

నిరాశకు గురైన టిడిపి కార్యకర్తలు

నేమకల్లులో సిఎం పర్యటన తిలకించడానికి బొమ్మనహాల్ మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరాశకు గురయ్యారు. కనేకల్, బొమ్మనహాల్, డి. హీరేహాల్, రాయదుర్గం, బళ్లారి ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలను, అభిమానులను చంద్రబాబు సమావేశానికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గ్రామ సమీపంలోని కంకర మిషన్ల వద్ద, డి. హీరేహాల్ వద్ద తాము వచ్చిన వాహనాలను పార్కు చేసుకుని అక్కడే ఉండిపోయారు. నేమకల్లు గ్రామానికి చెందిన ఆధార్ కార్డు ఉంటేనే సమావేశానికి ప్రవేశం ఉంటుందని పోలీసులు చెప్పారు. దీంతో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోయారు.

జిల్లా ప్రగతిపై సమీక్ష

నేమకల్లు పర్యటన అనంతరం హెలీప్యాడ్ వద్ద సిఎం చంద్రబాబు నాయుడు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



గ్రామంలోని చిన్నారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు



అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి

వైఫల్యాలను ఎత్తి చూపితే వ్యక్తిగత దూషణలా..?

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఎత్తిచూపితే మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి వ్యక్తిగత దూషణలు చేయడం ఎంత వరకూ సబబు అని మేయర్ మహమ్మద్ వసీం ప్రశించారు. శనివారం నగరంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరూ ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడకూడదనే ధోరణిలో జెసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడటం మంచిది కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న నిర్లక్ష్యంపై ప్రతిపక్ష పార్టీగా ఎత్తి చూపుతామన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డి వాడే భాష తాడిపత్రిలో చెల్లుతుందేమోగానీ, అనంతపురంలో చెల్లదన్నారు. అనంత వెంకటరామిరెడ్డి నాలుగు సార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా ఏవిధంగా గెలిచారో జిల్లా ప్రజలకు బాగా తెలుసు అన్నారు. వెంకటరామిరెడ్డి ఎంపీగా పోటీ చేసినపుడు మీ నియోజకవర్గంలో మీకంటే ఎక్కువ ఓట్లు ఎంపీకే వచ్చాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యంగా తాను మేయర్ కావడానికి రూ.5 కోట్లు ఇచ్చానని మాట్లాడుతున్న జెసి ఎవరికి, ఎప్పుడు ఇచ్చానో ఇచ్చానో సమాధానం చెప్పాలన్నారు. ప్రభాకర్‌రెడ్డి బెదిరింపులకు బయపడేది లేదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు నరసింహులు, రహంతుల్లా, ఇషాక్, రమణ, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, చంద్రలేఖ, లావణ్య, హసీనాబేగం, రామాంజినమ్మ, మీనాక్షమ్మ, కోఅప్షన్ సభ్యులు మారతమ్మ, ఉమామహేశ్వరి, శంషుద్దీన్, నాయకులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, రామచంద్ర, సుబ్బయ్య, కుళ్లాయిస్వామి, దాదాఖలందర్, చింతకుంట మధు, శోభ, కృష్ణవేణి, ఉష, శోభ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాలకుల చేసిన పాపాలతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో మరోమారు రూ.9,412 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఇంత పెద్దమొత్తంలో ప్రజలపై భారం వేయడం విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. గతనెలలో రూ.600 కోట్లకుపైగా భారాలు వేసి, ఇప్పుడు మరోమారు రూ.12,844 కోట్లభారం వేయడానికి డిస్కామ్‌లు ప్రతిపాదించగా రూ.9,412 కోట్లు మాత్రమే భారం వేయడానికి అంగీకరించామని ఇఆర్‌సి కార్యదర్శి పి.కృష్ణ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్తు కొనుగోలులో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి ఎక్కువ ధరకు కొనుగోలు చేశారని అమెరికా కోర్టులో అదానిపై నమోదైన కేసు సంచలనం సృష్టిస్తుంటే ఆ పాపాల భారాన్ని ప్రజలపై వేయడం ఏంటని ప్రశ్నించారు. ఆనాటి అక్రమ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా వైసిపి విధానాలను కొనసాగిస్తూ అదానీకి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ ద్వారా 6,200 మెగావాట్ల విద్యుత్‌ను 8 జిల్లాల్లో అదానీ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయని, ఈ విద్యుత్‌ను యూనిట్ రూ.2.49పైసలకు కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై వేయడం ఏంటన్నారు. ఇప్పటికే కృష్ణపట్నం ఓడరేవులో 75 శాతం, గంగవరం ఓడరేవు లో రాష్ట్ర ప్రభుత్వ వాటా పూర్తిగా అదానీ చేతుల్లోకి వెళ్లిందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలతో యూనిట్‌కు రూ.50పైసలకుపైగా భారం పడుతుందన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు, విద్య, వైద్యం ఖర్చులు భారీగా పెరిగిన పరిస్థితుల్లో ఇంత పెద్దమొత్తంలో విద్యుత్ భారాలు వేయడాన్ని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 1వ కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, ముత్తుజా, గోపాల్, వలి, హనుమంతురాయుడు, మసూద్, రాజు, శీనా, ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, నాగభూషణం, వరలక్ష్మి, ఎర్రిస్వామి, శంకర్, ప్రసాద్, నల్లప్ప, డేవిడ్, ఇస్మాయిల్, వెంకట తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

దుమ్మూధూళి..ఆరోగ్యం ఖాళీ..

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల పరిధిలోని బళ్లారి నుంచి బెంగళూరుకు వెళ్లే జాతీయ ప్రధాన రహదారిపై వెదజల్లుతున్న దుమ్మూధూళితో ప్రజలు నాన్న ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. పనులు చేసేచోట గుత్తేదారులు రోడ్డుపై దుమ్మూధూళి వెదజల్లకుండా నీరు చల్లాలి. అయితే అవేవీ పట్టించుకోకపోవడంతో దుమ్మూదూళి విపరీతంగా వస్తోంది. పెద్ద వాహనం రోడ్డుపై వస్తే భారీగా దుమ్మూదూళి వెదజల్లుతూ ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు పరిసర ప్రాంతంలో నివాసాల్లో ఉన్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



దుమ్మూధూళిలో ఇబ్బందులు పడుతూ వెళ్తున్న వాహనదారులు



లారీ వెళ్తుండగా రేగుతున్న దుమ్ము

సిఎం చంద్రబాబుకు నాయకుల ఘనస్వాగతం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు జిల్లాలోని ఎంపి, ఎమ్మెల్యేలు శనివారం ఘన స్వాగతం పలికారు. పింఛన్లు పంపిణీ చేసేందుకు బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లుకు చేరుకున్న చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద మంత్రులు పయ్యావుల కేశవ్, సవితమ్మ, విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారధి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్.రాజు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ పి.జగదీష్, తదితరులు బొకేలు అందజేశారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి నేమకల్లుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును హెలిపాడ్ వద్ద తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి స్వాగతం పలికారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, సంగా తేజస్విని



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సాఫ్ట్‌బాల్ లీగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ సౌజన్యంతో జోనల్ లెవెల్ రూరల్ అండర్-13 మిక్స్ జెండర్ సాఫ్ట్‌బాల్ లీగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం జరిగాయి. ఇందులో భాగంగా అనంత సాఫ్ట్‌బాల్ క్లబ్, కడదరకుంట సాఫ్ట్‌బాల్ క్లబ్, పెదవలి సాఫ్ట్‌బాల్ క్లబ్, బుక్కరాయసముద్రం సాఫ్ట్‌బాల్ క్లబ్, కురుగుంట, తాడిపత్రి క్లబ్ సాఫ్ట్‌బాల్ క్లబ్ మధ్య లీగ్ పద్ధతిలో టోర్నమెంట్ సాగింది. ఈ సందర్భంగా ఆర్డీటీ గ్రాస్ రూట్ లెవెల్ కో ఆర్డినేటర్లు వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీసేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విన్నర్స్, రన్నర్ జట్లను సెంట్రల్ లెవెల్‌లో డిసెంబర్ 4, 5న ఆర్డీటీ అనంత క్రీడామైదానంలో జరిగే సెంట్రల్ లెవెల్ పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జియో తెరపిస్ట్ అశోక్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నాగరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సోషల్ మీడియాతో యువత అప్రమత్తంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. శనివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలోని బాటని విభాగంలో హెచ్ఒడి శ్రీదేవి అధ్యక్షతన విప్లవ్ ఆధ్వర్యంలో 'సోషల్ మీడియా-సైబర్ బుల్లియింగ్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరూ సోషల్ మీడియాలో ఎక్కువ కాలం గడుపుతున్నారన్నారు. ఇందులో అసభ్యకరమైన పోస్టులకు చాలామంది ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. కావున ప్రతిఒక్కరూ సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ పోలీసుల సోసియల్ మీడియాలో పని చేస్తున్న హరి, పుష్ప, మెర్సీ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ కోఆర్డినేటర్ కొండప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

అర్బన్ బ్యాంకులో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో శనివారం ఆన్‌లైన్ సేవలను చైర్మన్ జె.ఎల్.మురళీధర్ ప్రారంభించారు.



ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న జెఎల్.మురళి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారులకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అతిత్వరలోనే సిటిఎస్ చెక్‌బుక్ సౌకర్యం, ఎటిఎం సేవలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. జాతీయ బ్యాంకులు అందించే డిజిటల్ సేవల్లో అర్బన్ బ్యాంకు ఏమాత్రం తీసిపోదన్నారు. ఆయా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంకు ఎపి సర్కిల్ హెడ్ జి.రవీంద్రనాథ్, బ్యాంకు సిఇఒ ఎం.విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజలకు చట్టాలు, పౌరహక్కులపై అవగాహన ఉండాలని వన్‌టౌన్ సిఐ రాజేంద్రనాథ్‌యాదవ్ సూచించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు నగరంలోని బుడ్డప్పనగర్‌లో 'సివిల్ రైట్స్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన చట్టాలు, పౌర హక్కుల గురించి ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. అందుకు అనుగుణంగానే ప్రజలు జీవించాలని సూచించారు. ప్రజలందరూ సమానమేనని, ఎక్కడా వివక్ష లేకుండా ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-అనంతపురం

సోషల్ మీడియా వాడకంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సంసిద్ పాఠశాల విద్యాధికారి ఇందుసానో సూచించారు. శనివారం నగర సమీపంలోని రాచానపల్లి వద్ద ఉన్న సంసిద్ధ పాఠశాలలో ఉపాధ్యాయిని రుక్సానాబేగం అధ్యక్షతన 'సోషల్ మీడియా ఉపయోగాలు.. ఇబ్బందులు' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియా వల్ల జరిగే ప్రయోజనాలు, అనర్థాలపై చర్చగోష్టి నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ రంగాలకు చెందిన విశిష్ట వ్యక్తుల ద్వారా విద్యార్థులకు సందేశం, ఉపన్యాసం ద్వారా అవగాహన కల్పించడం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు మెమొంటోలను అదజేస్తున్న సంసిద్ పాఠశాల విద్యాధికారి ఇందు సానో

సమాజ దిక్సూచి గురువే... : మాజీమంత్రి రఘువీరా

ప్రజాశక్తి-కుందుర్పి

అక్షర జ్ఞానం పెంచే గురువే సమాజ దిక్సూచి అని మాజీమంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి అన్నారు. శనివారం మండలం పరిధిలోని బండమీదపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఎంఇఒ ఓబుళపతి అధ్యక్షతన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని స్థానాల కన్నా గురువు స్థానం చాలా గొప్పదన్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మారుతీశ్వరి రామ్మూర్తి, విశాలాక్షి, వన్నూరురెడ్డి, తిప్పేస్వామి, హసీనాబీ, హతావుల్లా, మాజీ ఎంపిటిసి మంజునాథ, ఎపిటిఎఫ్, ఎస్‌టియు ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్.రఘువీరారెడ్డి

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని కల్లూరు గ్రామ పంచాయతీలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఇందులో భాగంగా దాదాపు వెయ్యిమందితో సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సామల మధు, రామాంజి, రాజన్న, పిల్లల గంగాధర్, పూజారి మాధవ, రామకృష్ణ, డాక్టర్ ఆర్మీ శేషయ్య, చింత వెంకటరాముడు, రమణ, రామాంజి, తరుణ్, సాయి, గణేష్, కిషోర్, నాగభూషణం, పెద్దన్న, బెల్లం రామాంజినేయులు, గాజుల మాబూ, ఆరవ పవన్, కృష్ణ, బాషా, కేశప్ప, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే యూనియన్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గుత్తి

రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు కోసం డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో జరిగే ఎన్నికల కోసం స్థానిక రైల్వేషెడ్‌లో శనివారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా రైల్వేలోని వివిధ విభాగాల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఎడిఎస్ అశ్విని, నారాయణ, తదితరులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. రైల్వే కార్మికుల, ఉద్యోగులు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేసే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుర్తు జెండాకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ కోశాధికారి శర్మ, గుత్తి డివిజన్ బ్రాంచ్ నాయకులు రామాంజినేయులు రెడ్డి, శేఖర్, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సుధాకర్, రైల్వే ఇన్స్టిట్యూట్ కార్యదర్శి రవికుమార్, ఎస్సీ, ఎస్టీ కార్యదర్శి రామ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో పెయింటర్‌కు గాయాలు



మంచాన పడిన పెయింటర్ సత్యనారాయణ

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని రెడ్డిపల్లికి చెందిన పెయింటర్ బండాల సత్యనారాయణ పని చేస్తూ కింద పడి గాయాలైన ఘటన శనివారం రాప్తాడు మండల పరిధిలోని చిన్మయనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బండాల సత్యనారాయణ దినసరి కూలీగా పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే నార్పల మండలం దుర్గం గ్రామానికి చెందిన పెయింటింగ్ కాంట్రాక్టర్ నాగరాజు ఆదేశాల మేరకు శనివారం చిన్మయనగర్‌లో పెయింటింగ్ వేసేందుకు వెళ్లాడు. ఈనేపథ్యంలో పెయింటింగ్ వేస్తూ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో రెండు కాళ్లు విరిగాయి. వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కాళ్ల పెద్ద ఎముకలు విరిగినందున ఆరునెలలు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సత్యనారాయణకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దినసరి కూలి అయిన సత్యనారాయణ ఆరునెలలు పనికి వెళ్లకుంటే కుటుంబ పోషణ భారం అవుతుంది. కావున సంబంధిత కాంట్రాక్టర్, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గుత్తి : పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. స్థానిక జెండా వీధి సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నారాయణ, జయమ్మలు గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ప్రమాదంలో పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన అయ్యప్ప మాల ధరించిన ఉప్పర రవి పూజ నిమిత్తం గుత్తికి వస్తుండగా బండల పరిశ్రమ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన రవిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇస్రోలో ఇంటర్న్‌షిప్‌నకు ఎస్ఆర్ఐటి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-శింగనమల

సార్ట్, ర్టింగ్ మీసా ప్రోగ్రామ్ ద్వారా ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో ప్రతిష్టాత్మకమైన ఇంటర్న్‌షిప్ చేసేందుకు బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం సమీపంలో ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాల విద్యార్థి కోటీశ్వర్ ఎంపికయ్యాడు. ఇందులో భాగగా కోటీశ్వర్ అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఎసి)లో ఇంటర్‌షిప్ చేయనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్య నాణ్యత, అంకితభావానికి కోటీశ్వర్ ఉదాహరణ అన్నారు. ప్రతిభను పెంపొందించడం, విద్యార్థులు పోటీతత్వ రంగాల్లో రాణించడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందించడంలో ఎస్ఆర్ఐటి ఎప్పుడూ ముందుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల టిపిఒ ఎం.రంజిత్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సిసి డే

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సిసి డే - 2024 వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన 6వ ఆంధ్రాబ్ గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సిసి అనంతపురం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎల్‌డి రోడ్రిగ్స్ మాట్లాడుతూ దేశ ఏక్తా, సమగ్రతను కాపాడటం, క్రమశిక్షణ, ఫంక్తిశీలతకు ఎన్‌సిసి చాలా కీలకమన్నారు. అంతేగాకుండా ఎన్‌సిసి సామాజిక సేవను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక కలబురిగి సెంట్రల్ యూనివర్సిటీ వాణిజ్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ జి.రంగనాథం, 2 ఎన్‌సిసి యూనిట్ల చీఫ్ ట్రైనింగ్ ఆఫీసర్లు ఎం.రామాంజనేయులు, జి.చిన్నవెంకటమ్మ, అధ్యాపకులు ఇ.అహ్మద్, ఆంగ్ల విభాగం లెక్చరర్, శ్రీరామ్, కళాశాల శారీరక విద్యా సంచాలకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సిసి క్యాడెట్లు, అతిథులు

జనవరిలో కళాకారుల మహాసమ్మేళనం

ప్రజాశక్తి-అనంతపురం

వచ్చే ఏడాది జనవరిలో నగర సమీపంలోని అనంతలక్ష్మి కళాశాలలో నవ్యాంధ్ర రచయితల సంఘం, అనంతలక్ష్మి విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సహస్ర కవులు, కళాకారుల మహాసమ్మేళనం నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ అనంతరాముడు తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాదులోని ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో ఇందుకు సంబంధించిన శనివారం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి సిటిఒకిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, నాగప్ప, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ పాలరాజు, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, బాబు, ఫరీసా ఫిర్దోస్, మల్లికార్జున పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-గుత్తి

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన టిఐ ప్రాజెక్ట్, ఐసిటిసి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సి.ఎల్లప్ప బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ వెంకటేశులు, ల్యాబ్ టెక్నీషియన్ అమర్నాథ్, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ టిఐ ప్రాజెక్టు పిఎం.జి.రమేష్, ఎఎన్ఎం డి.కవిత, ఎంఇఎ ఆర్.సందీప్, ఓఆర్ డబ్ల్యులు డి.కృష్ణవేణి, షేక్ శంషాద్, జి.రాధాకుమారి, ఆర్.జోష్న, జి.లావణ్య, పి.జోష్న, తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు నివాళి


ప్రజాశక్తి-గుత్తి

ప్రముఖ తెలుగు రచయిత గురజాడ అప్పారావు వర్థంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు శామ్యూల్, చెన్నారెడ్డి, హసన్‌అహ్మద్, స్వామిదాస్, నారాయణశెట్టి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 'పివికెకె' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

నగర సమీపంలోని రుద్రంపేటలో ఉన్న పివికెకె ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఐదుగురు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు చెన్నైలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బండి సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై కు చెందిన ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ వస్తు తయారీ సంస్థ అభిరామి ఇంజనీరింగ్ వర్క్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో జరిగిన ప్రాంగణ నియామకాల్లో పివికెకె ఐటిలో ఇఇఇ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న వసీం అక్బర్ చిగిరి, జస్వంత్ కుమార్ బస్తా, సతీష్ బాబు పెర్మి, రాజేష్ అల్లెల, శ్రీకాంత మురిమి ఉద్యోగాలకు ఎంపిక కావడం గమనార్హమన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులకు కళాశాల చైర్మన్ పల్లె కిషోర్, ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఇఇఇ విభాగాధిపతి మహేష్, ఎఒ మనోహర్‌రెడ్డి, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.ప్రశాంత్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో పివికెకె సిబ్బంది

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం : నగరంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సాయి ట్రేడర్స్, మన గ్రోమోర్ దుకాణాలను పరిశీలించారు. ఇందులో సాయి ట్రేడర్స్‌లో కాలం చెల్లిన ఐదు రకాల పురుగు మందులను గుర్తించి విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిఐ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి వాసుప్రకాస్, డిసిటిఒ సురేష్‌కుమార్, కళ్యాణదుర్గం ఎడిఎ యల్లప్ప పాల్గొన్నారు.

16 నుంచి అంతర్ డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీలు

ఎస్‌వి విద్యాసంస్థల వైస్‌చైర్మన్ సి.చక్రధరరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల, ఎస్‌కెయు సంయుక్త ఆధ్వర్యంలో వచ్చేనెల 16వతేదీ నుంచి అంతర్ డిగ్రీ కళాశాల క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌వి కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16వతేదీ ఎస్‌వి డిగ్రీ కళాశాలలో పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. అనంతరం ఆర్డీటీ క్రీడా మైదానాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16న ప్రారంభమై 21వతేదీ వరకూ పోటీలు సాగుతాయన్నారు. ఆసక్తి ఉన్న ఎస్‌కెయు పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈనెల 12వలోపు ఎస్‌వి డిగ్రీ కళాశాలలోని పీడీ ఎం.శ్రీనివాసులునాయక్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, పీడీ శ్రీనివాసులునాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వి విద్యాసంస్థల వైస్‌చైర్మన్ సి.చక్రధరరెడ్డి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీచైతన్య ఎజిఎం

'శ్రీ చైతన్య'లో సోషల్ వీక్ డే

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సోషల్ వీక్ డే వేడుకలను ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా వార్తా పత్రికల పఠనం, చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాలలో పనిచేసే ఆయాలు, వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులను ఎజిఎం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, ప్రైమరీ ఇన్‌ఛార్జి భారతి, తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో ఇల్లు లేని వారు ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని టిడిపి నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇల్లు కావాల్సిన లబ్ధిదారుడి ఆధార్ కార్డు, భర్త కుటుంబ సభ్యుల ఆధార్, భార్యాభర్తల బ్యాంకు అకౌంట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, స్థలం యొక్క పత్రాల జిరాక్స్ కాపీలతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కెనాల్‌లో కంపచెట్ల తొలగింపు

పుట్లూరు : మండలంలో సుబ్బరాయుడు సాగర్ నుంచి రెండు, మూడు రోజుల్లో నీరు విడుదల చేయనున్న నేపథ్యంలో టిడిపి నాయకులు శనివారం హెచ్చెల్సీలో జెసిబి ద్వారా కంపచెట్లను తొలగించారు. ఇందులో భాగంగా ఎ.కొండాపురం నుంచి చింతకుంట వరకూ హెచ్చెల్సీకి ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కంపచెట్లను తొలగిస్తున్న జెసిబి

కష్టాల్లో ఉన్నా.. మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం నగరంలోని 9, 49వ డివిజన్లలో స్వయంగా ఆయనే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఇచ్చిన మొదటి ఐదు హామీల అమలుపైనే సిఎం చంద్రబాబు సంతకం చేశారన్నారు. ఇందులో పింఛన్ల పెంపు ముందుందన్నారు. మిగిలిన హామీలను కూడా త్వరలోనే అమలు చేయనున్నట్లు తెలిపారు.

అనంతపురం : నగరంలోని 10వ డివిజన్‌లో శనివారం తెల్లవారుజామునే పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వతేదీ ఆదివారం రావడంతో 30వతేనే పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకురాలు కంటా దేవి, సచివాలయ అధికారి గురుప్రసాద్, తదితరుల పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని గౌరయ్య కొట్టాల కాలనీ, ఆర్‌డిటి పాఠశాల ప్రదేశాల్లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పెంచిన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కాటప్పగారు రామలింగారెడ్డి, నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, ఓబుళపతి, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, తహశీల్దార్ పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలో ఉదయం 6 గంటలకే ఎంపిడిఒ నిర్మలకుమారి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ డబ్బులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రం మండలంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



అనంతపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు



శింగనమలలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ నిర్మలకుమారి, సచివాలయ సిబ్బంది



స్వామివారికి పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు, అర్చకులు

ఘనంగా పల్లకిసేవ

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి పల్లవిసేవ శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారి శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి


ప్రజాశక్తి-గుంతకల్లు

వారంరోజులుగా ప్రజలకు మంచినీరు అందించడంలో వైఫల్యం చెందిన ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కమిటీ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ మహమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలో తాగునీరు సరఫరా చేసే మెయిన్ పైపులైన్ పగిలిపోయి వారంరోజులు అవుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇంజినీర్ అధికారుల బాధ్యతారహిత్యమే ఇందుకు కారణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుని వెంటనే ప్రజలకు తాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, సత్తార్, తుర్కపల్లి రామాంజనేయులు, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు బాషా, నారాయణ, రాందాస్, రంగానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పదవి మాదిగలకే ఇవ్వాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పదవి మాదిగ సామాజిక వర్గానికే ఇవ్వాలని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జి మీనుగ గోపాల్ కోరారు. ఈమేరకు శనివారం పట్టణంలోని స్వగృహంలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అన్ని ప్రభుత్వాలు కేవలం మాల సామాజిక వర్గానికి మాత్రమే ఛైర్మన్ పదవి ఇచ్చారన్నారు. దాదాపు 50 లక్షల మంది మాదిగలు గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసి మద్దతు తెలిపారన్నారు. కావున మాదిగ సామాజిక వర్గంలో ఉన్న మేధావులకు కమిషన్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో లత్తవరం చంద్రశేఖర్, రేణుమాకులపల్లి బి.సాకే రమేష్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ

గ్రంథాలయాల తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గ్రంథాలయంలోని రికార్డులు, రిజిస్టర్లు, పుస్తకాలను పరిశీలించారు. తర్వాత సౌకర్యాలపై పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఏ పుస్తకాలున్నాయి.. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఏ పుస్తకాలు తెప్పిస్తున్నారనే విషయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ మండల కేంద్రంలోని నిరుద్యోగ యువతీ యువకులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇకపోతే గ్రంథాలయానికి ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు జంతువులు ప్రవేశించి పరిసరాలను అపరిశుభ్రమవుతున్నాయని, ప్రహరీ నిర్మించాలని పలువురు పాఠకులు కార్యదర్శికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి జీవన, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత గ్రంథాలయంలోని పుస్తకాలు, పాఠకులు, రావాల్సిన బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.జయరాములు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ శనివారం సందర్శించారు. ఇందులో భాగంగా వార్షిక రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణపై లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డిని అభినందించారు. అనంతరం లైబ్రరీ సభ్యులు, సెస్ వసూళ్లపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.



నార్పలలో రికార్డులను తనిఖీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమ



బొమ్మనహాల్ మండలం నేమకల్లులో పర్యటిస్తున్న సిఎం చంద్రబాబు



సిఎం చంద్రబాబుతో సెల్ఫీ తీసుకుంటున్న మహిళ

అభివృద్ధిలో 'పవన్' మార్క్ కనిపించాలి

అహుడా ఛైర్మన్ టిసి వరుణ్‌తో సీఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం నేమకల్లు లో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీసీ వరుణ్ కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అభివృద్ధిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్క్ కనిపించే విధంగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో అందర్నీ సమన్వయం చేసుకొని, ముందుకెళ్లాలని మీకు అన్ని విధాలుగా ప్రభుత్వ సహాయ సహకారాలు సమృద్ధిగా అందిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో.. మీ సహాయ సహకారాలతో రాయలసీమలోనే అర్బన్ డెవలప్మెంట్ లో పారదర్శకత లోపించకుండా అహుడాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని వరుణ్ పేర్కొన్నారు.



టిసి.వరుణ్‌ను అభినందిస్తున్న సిఎం చంద్రబాబు